పెండింగ్ పనులు వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో జంటసర్కిళ్ల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయని, యుద్ధ ప్రాతిపదికన వాటికి మరమ్మతులు చేసి రాకపోకలకు ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్లలో చేపట్టాల్సిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, ఏఈ మల్లారెడ్డి, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



లింగ చెరువును పరిశీలిస్తున్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి

సుభాష్‌నగర్: గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం ఆయన సూరారం ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న లింగా చెరువును సందర్శించారు. చెరువు వద్ద జరిగే నిమజ్జనంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనంలో భాగంగా పటిష్టమైన బందోబస్తు, రూట్ మ్యాప్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, సిఐలు భరత్ కుమార్, శ్రీనివాసులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నిజాంపేట్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిజాంపేట్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రఘునాథ్ మాట్లాడుతూ ఒక సాధారణ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి దేశానికి రాష్ట్రపతి పదవిని చేపట్టిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు.. సమాజంలో గురువు స్థానం ఎంతో గొప్పదని, ఉపాధ్యాయుల మార్గదర్శనంలో విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

మట్టి గణపతికి జై కొడదాం..



ఆదర్శ్‌నగర్‌లో...



గాజులరామారం ఎస్పీఆర్ స్కూల్‌లో..



సూరారంలో..



షాపూర్‌నగర్‌లో..



పీసీబీ ఆధ్వర్యంలో...



మగ్దూమ్‌నగర్‌లో..



జగద్గిరిగుట్ట కాళికాదేవి ఆలయంలో..

వినాయక చవితి పండగను పురస్కరించుకుని సంక్షేమ సంఘాలు, ప్రజాప్రతినిధులు,సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి గణపతుల విగ్రహాల పంపిణీ చేపట్టారు. పర్యావరణానికి హితం చేసే మట్టి గణపతులను ఇళ్లల్లో ప్రతిష్ఠించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు.ఆయా ప్రాంతాల్లో చేపట్టిన ఉచిత గణపతి విగ్రహాల పంపిణీలో పెద్ద సంఖ్యలో ప్రజలు విగ్రహాలను తీసుకువెళ్లారు. -కుత్బుల్లాపూర్

గణేష్ ఉత్సవ ఏర్పాట్లపై నిర్లక్ష్యం తగదు



బాచుపల్లిలో చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు

నిజాంపేట్: గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ఆరోపించారు. శుక్రవారం ఉత్సవ సమితి సభ్యులు నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ, కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని వివిధ చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. పలు చెరువుల వద్ద విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు, నిమజ్జన ఘాట్లలో పూడిక తీయకపోవడం, ,శుభ్రం చేయకపోవడం, క్రేన్‌ల ఏర్పాటు జరగకపోవడం, మంచినీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, బారికేడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడవంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ గిరివర్ధన్‌రెడ్డి, కో.కన్వీనర్ ఆకుల సతీష్‌ముదిరాజ్, నిజాంపేట్ కార్పొరేషన్ కన్వీనర్ సుబ్బారావు, కో.కన్వీనర్ చక్రధర్, దుండిగల్ కన్వీనర్లు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, సభ్యులు అశోక్, డాక్టర్ రాజు, అరుణ్‌రావు, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ సౌజన్య, బాచుపల్లి సిఐ ఉపేందర్, ఎస్ఐరమేష్, దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ, ఇరిగేషన్ ఏఈ సారా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ ఉత్సవాలు



చింతల్: చింతల్ డివిజన్ భగత్ సింగ్‌నగర్‌లోని విజ్ఞాన్ విద్యానికేతన్ స్కూల్‌లో శుక్రవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణనాథుడి పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

చింతల్: హెచ్ఎంటీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, కల్యాణ మండపానికి శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికల్లో మూడు ప్యానల్స్ పోటీ పడగా ఉపాధ్యక్షుడిగా లేపాక్షిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, సంయుక్త కార్యదర్శిగా డి.మధు విజయం సాధించారు. త్వరలోనే కమిటీ అధ్యక్షుడు, పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోనున్నట్లు జనరల్ సెక్రెటరీ పున్నా శ్రీశైలం తెలిపారు.

రేషన్ షాపులలో తడిసిన బియ్యం



సుభాష్‌నగర్: వరుస వర్షాలతో దుండిగల్ గండిమైసమ్మ మండలంలోని పలు రేషన్ షాపుల్లో బియ్యం తడిసిపోయాయి. ఐదు రోజుల పాటు వరుసగా వర్షాలు కురవడంతో నీటి తేమ గోడల్లో లోపటికి వచ్చింది. మండలంలో 21 రేషన్ షాపులు ఉండగా పలు చోట్ల వందల బస్తాల బియ్యం తడిసి ముద్దయ్యింది. దూలపల్లిలోని షాప్ నంబర్-2లో 36 సంచుల్లో బియ్యం గడ్డలు కట్టింది సంబంధిత అధికారులు స్పందించి తడిసిన బియ్యాన్ని వెనక్కి తీసుకుని, కొత్త బియ్యాన్ని పంపాలని కోరుతున్నారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి తీరని లోటు



జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక సభ్యులు

కుత్బుల్లాపూర్: జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఉషోదయ టవర్స్ వద్ద జిట్టా బాలకృష్ణారెడ్డి చిత్రపటానికి ఐద్యవేదిక సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా పనిచేసిన జిట్టా మన మధ్య లేరనే విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆయన సేవలను రాష్ట్ర ప్రజలు మరువరన్నారు.కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, నరసింహులు, జానయ్య, వీరన్న, శ్రీను పాల్గొన్నారు.

కొణతం దిలీప్ అరెస్ట్ అనైతికం

ఆల్విన్‌కాలనీ: ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధాలు విధించటం సరికాదని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి కొణతం దిలీప్‌ను నిర్బంధించటం దారుణమన్నారు. ఆయనను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తూ తప్పలను ఎత్తి చూపుతున్న వారిని టార్గెట్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎన్ని నిర్బంధాలు విధించినా కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తి చూపుతూనే ఉంటామన్నారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక దినోత్సవం



కుత్బుల్లాపూర్: బ్యాంక్ అఫ్ ఇండియా 119వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం కొంపల్లిలోని బ్రాంచ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ఖాతాదారులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1906లో ప్రారంభమైన బ్యాంక్ అఫ్ ఇండియా నేడు దేశవ్యాప్తంగా 5300 బ్రాంచీలతో విజయవంతంగా ఖాతాదారులకు సేవలను అందిస్తోందన్నారు. బ్యాంకింగ్ సేవల్లో భాగంగా కరెన్సీ మార్పిడి, ప్రత్యేక లాకర్ సౌకర్యం, విదేశీ కరెన్సీ మార్పిడి, బీమా మధ్య వర్తిత్వ సేవలు, పెట్టుబడి సంబంధిత సేవలు, మ్యూచ్‌వల్ ఫండ్లలో పెట్టుబడులు, రిటైర్మెంట్ ప్లానింగ్, గోల్డ్ డిపాజిట్ తదితర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఫిక్సిడ్ డిపాజిట్ స్కీమ్ ద్వారా 333 రోజులకు 7.25%. ఇంటరెస్ట్ రేట్ అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు సుబ్బారావు, ప్రియదర్శిని, హర్ష కుమారి, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ స్థలం కబ్జాకు యత్నం



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని జయనగర్ కాలనీకి చెందిన కమ్యూనిటీ హాల్ స్థలానికి కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఫెన్సింగ్ నిర్మిస్తుండటంతో కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈ భూమిపై తమకు కోర్టు ఉత్తర్వులు ఉన్నాయంటూ కొందరు వ్యక్తులు శుక్రవారం ఉదయం పనులు చేపట్టడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. స్థానిక కాలనీ వాసులు, మహిళలు వచ్చి ఫెన్సింగ్ వేస్తున్న వారిని అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో వారు అక్కడే ఉన్న మహిళలను వీడియో తీస్తూ బెదిరించటంతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడికి చేరుకొని కూకట్‌పల్లి పోలీసులను రప్పించారు. స్థలాన్ని స్వాధీనంచేసుకునేందుకు వచ్చిన వారు తమ వద్ద ఉన్న పత్రాలను, కోర్టు జారీ చేసిన ఇంటరిమ్ ఆర్డర్ కాపీలు చూపించగా వారిని అక్కడి నుంచి పంపించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం జయనగర్ కాలనీ లే అవుట్ ఏర్పాటు చేయటం జరిగిందని, ప్రస్తుతం ఉన్న ఈ ఖాళీ స్థలంలో కమ్యూనిటీ హాల్‌తో పాటు వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొందరు ప్రైవేట్ వ్యక్తులు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి భూమి తమదంటూ కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. హెచ్ఎండీఏ లే అవుట్ ప్రకారం ఇక్కడ కాలనీకి సంబంధించిన పార్కు ల్యాండ్‌గా అధికారులు ఆర్‌టీఏ ద్వారా ధృవీకరించినట్లు తెలిపారు. అయినా కొన్నేళ్లుగా కొందరు వ్యక్తులు సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తూనే ఉన్నారని వారిపై ఇప్పటికే కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హైకోర్టు ఆర్డర్ పేరు మీద కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా..?

- అధికారులు సమయపాలన పాటించడం లేదు
- వారి వైఖరితో ప్రభుత్వానికి చెడ్డపేరు
- బాధ్యులపై సీఎంకు ఫిర్యాదు చేస్తా
- జంట సర్కిల్ కార్యాలయాల్లో మాజీ ఎమ్మెల్యే కూన హల్‌చల్



డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన జంట సర్కిల్ కార్యాలయాల వద్ద హల్చల్ చేశారు.. పలు విభాగాలను సందర్శించిన ఆయన అధికారులు లేకపోవడంతో నేరుగా వారికే ఫోన్ చేసి 11 గంటల దాటినా ఇంకా విధులకు ఎందుకు రాలేదని నిలదీశారు..ఈ విషయంపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఫోన్ చేసి అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు.. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు సమయానికి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కు ఫిర్యాదు చేశారు. వారం రోజులుగా ఇదే తంతు కొనసాగుతున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం ఆయన స్వయంగా జంట సర్కిల్ కార్యాలయాలను సందర్శించారు. వివిధ విభాగాల్లో కలియ తిరుగుతూ ఎంత మంది అధికారులు వచ్చారని ఆరా తీశారు.. గాజులరామారం ఉప కమిషనర్ మల్లారెడ్డి తప్ప మరెవరు ఆఫీసులో కనిపించలేదు..ఈ విషయంపై ఆయన డిప్యూటి కమిషనర్ ఆరా తీయగా బయట మీటింగ్ వెళ్లారని.. సైట్‌లో ఉన్నారని పలు కారణాలు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వారికి అందజేయాల్సిన అధికారులు వారిని పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారుల తీరు బాగోలేదని.. గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులే ఇప్పుడు ఉన్నారని.. వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించడం లేదన్నారు. విధి నిర్వహణలో సయమపాలన పాటించడం లేదని. ఈ విషయంపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై అధికారులపై ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి శ్రీధర్‌బాబులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.



జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కూన శ్రీశైలంగౌడ్

యువకుడి ఆత్మహత్య



భానుప్రకాష్ మృతదేహం..

కుత్బుల్లాపూర్: ఆన్‌లైన్ యాప్‌లో డబ్బులు పోవడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జీడిమెట్ల ప్రాంతానికి చెందిన భానుప్రకాష్(22) మూడు రోజుల క్రితం టెలిగ్రామ్‌లో వచ్చిన లింక్ ఆధారంగా ఆన్‌లైన్ స్టాక్స్ యాప్‌లో రూ.65వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీంతో మనస్తాపానికి లోనైన అతను గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. అతని మిత్రులు ఫోన్ లోకేషన్ ఆధారంగా ఫాక్స్ సాగర్ చెరువు వద్ద ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువు వద్ద మృతుడి బైక్, ఏటీమ్ కార్డు, సెల్‌ఫోన్లను గుర్తించారు. శుక్రవారం చెరువులో ఎన్డీఆర్ఎస్ బృందంతో గాలింపు చేపట్టి భానుప్రకాష్ మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగం చేయడం ఇష్టం లేక.. యువతి ఆత్మహత్య



కావ్యశ్రీ మృతదేహం

దుండిగల్: ఉద్యోగం చేయడం ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గండిమైసమ్మ గణేష్‌నగర్ కాలనీకి చెందిన నర్సింహ సాగర్ కుమార్తె కావ్యశ్రీకి గుంటూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చింది. అయితే అక్కడ ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోవడంతో ఆమె తండ్రితో గొడవ పడింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురైన కావ్యశ్రీ శుక్రవారం మధ్యాహ్నం భవనం మూడో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఆమెను కుటుంబ సభ్యులు సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.